# పాలకుర్తి వాణి

మన పల్లె.. మన ముచ్చట్లు

సంపుటి : 01 | సంచిక : 160 | వరంగల్ | మంగళవారం, 10 మార్చి 2026 | పేజీలు : 02





# మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

- కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం
- మహిళలు అన్ని రంగాల్లో ముందంజ
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**జనగామ, పాలకుర్తి వాణి :** మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలని ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి పేర్కొన్నారు. జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఘనపూర్ (స్టేషన్) మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య రెడ్డి, చిల్పూరు బుగులు వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ శ్రీధర్ రావు, గ్రంథాలయ సంస్థ కమిటీ చైర్మన్ మారుజోడు రాంబాబుతో కలిసి ఘనపూర్ (స్టేషన్) శాసనసభ్యులు కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ఆరంభించారు. ఈ సందర్భంగా ఘనపూర్ (స్టేషన్) ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముందుగా అందరు మహిళామణులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మహిళలు రాజకీయంగా, సామాజికంగా ఆర్థికంగా ముందడుగు వేస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎందరో మహిళలు తమ హక్కుల కోసం పోరాటాలు



చేస్తున్నారన్నారు. అందులో ప్రధానంగా భారతదేశంలో సావిత్రి భాయి పూలే, దుర్గాబాయి దేశ్ముఖ్ విద్యాలయాలను నెలకొల్పి, బాలికా విద్య కొరకు కృషి చేశారని పేర్కొన్నారు. అలాగే శిస్తుకు వ్యతిరేకంగా కాకతీయ రాజులకు ఎదురు తిరిగిన ధీరవనితలైన సమ్మక్క సారక్కలు స్ఫూర్తిదాయకమన్నారు. భూమి కోసం భుక్తి కోసం పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని ఎంతగానో కొనియాడారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, కోట్లలో వ్యాపారం చేస్తున్న మహిళా సంఘాలు ఉన్నాయని, అది దేశానికే చాలా గర్వకారణమని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అమలు చేస్తోన్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వ్యవస్థను విస్తరించడంతో పాటు మహిళలకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటూ, తల్లులు, శిశువుల ఆరోగ్య సంరక్షణను మెరుగుపరచడానికి నిరంతరం కృషి చేస్తున్నామని వివరించారు. నిజమైన మహిళా సాధికారత ఇంటి నుంచే ప్రారంభమవుతుందన్నారు. ఓ తండ్రి తన కుమార్తెకు "నీ కలలు కూడా అంతే ముఖ్యమైనవి" అని చెప్పినప్పుడు అది ప్రారంభమవుతుందని, పాఠశాలలో బాలికలను ప్రశ్నలు అడగడానికి, పోటీపడడానికి, నాయకత్వం వహించడానికి ప్రోత్సహించినప్పుడు అది ప్రారంభమవుతుందని, అలాగే సమాజంలో మహిళల భద్రత కేవలం వారి సమస్యగా మాత్రమే కాకుండా అందరి బాధ్యతగా భావించినప్పుడు అది నిజంగా ఆచరణలోకి వస్తుందని తెలిపారు. తదనంతరం జిల్లా అధికారులను శాలువాతో సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. అదే విధంగా వివిధ శాఖల ఉద్యోగినులకు ప్రశంసాపత్రాలతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ కోదండరాములు, డీసీపీఓ రవికాంత్, మిషన్ శక్తి కోఆర్డినేటర్ శారద, పలు శాఖల జిల్లా అధికారులు, మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.







WANTED

విలేకరులు కావలెను

పాలకుర్తి వాణి దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, మండల విలేకరులు కావలెను. తెలుగు భాషపై పట్టు, ప్రజా సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి ఇదే మా ఆహ్వానం..

9866366702, 9963261745






# రోజంతా ఎమ్మెల్యే బిజీ బిజీ పర్యటన

- ప్రజా పాలనలో పలు పనులకు శ్రీకారం
- ప్రారంభోత్సవాలు, అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే





**పాలకుర్తి, పాలకుర్తి వాణి:** ఎమ్మెల్యే యశస్విని రెడ్డి పాలకుర్తి మండలంలో సోమవారం రోజంతా బిజీబిజీగా పర్యటించారు. ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలతో పాటు ప్రజాపాలనలో చేపడుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించారు. చెన్నూరులో విద్యార్థులకు ప్రతిరోజు పెడుతున్న మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. పాలకుర్తిలో వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో పాల్గొని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. తొర్రూరు మండలంలోని పర్యటించారు.






# ఉద్యమకారుల సంఘం మండల అధ్యక్షుడిగా కుమార్ యాదవ్



పాలకుర్తి, పాలకుర్తి వాణి: తెలంగాణ ఉద్యమకారుల సంఘం పాలకుర్తి మండల అధ్యక్షునిగా జిట్టబోయిన కుమార్ యాదవ్ నియమితులయ్యారు. ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు భాషబోయిన రవీందర్ యాదవ్ ఆదేశాల మేరకు పాలకుర్తి మండల అధ్యక్షునిగా జిట్టబోయిన కుమార్ యాదవ్ నియమిస్తూ జనగామ జిల్లా అధ్యక్షులు పన్నీరు యాకన్న ఉత్తర్వులు జారీ చేశారు. సంఘం, ఫోరం బలోపేతంతోపాటు మరింత ముందుకు నడిపించడానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ జిల్లా కమిటీ నాయకుల నిర్ణయం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా తెలిపారు.




# డిజిటల్ విద్య కు ఇన్ఫోసిస్ ఫౌండేషన్ శ్రీకారం

**పాలకుర్తి వాణి, వరంగల్ :** భావి భారత పౌరులైన మన విద్యార్థుల అభ్యున్నతే లక్ష్యంగా, డిజిటల్ విద్యకు బాటలు వేస్తూ ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతోంది. వరంగల్ జిల్లా, రాయపర్తి మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్ల పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమం ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ రాపాక స్వాతి మరియు సి.ఎస్.ఆర్ (CSR) కోఆర్డినేటర్ రాపాక నాగరాజు సమక్షంలో, మార్చి 10, 2026 (మంగళవారం) ఉదయం 11:00 గంటలకు కోలన్‌పల్లి జెడ్.పి.హెచ్.ఎస్ (ZPHS) పాఠశాల ఆవరణలో జరగనుంది.జ్ఞాన దీపాలను వెలిగించే ఈ శుభకార్యానికి గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, గ్రామస్థులు విద్యాభిమానులందరూ విచ్చేసి, మన విద్యార్థుల ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ కోరారు.



# మంత్రి ఉత్తమ్‌కు రైతుల బాధలు తెలిపిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

**పాలకుర్తి, పాలకుర్తి వాణి :** వర్ధన్నపేట, రాయపర్తి, పెద్దవంగర, తొర్రురు, కొడకండ్ల, పాలకుర్తి మండలాల్లో సైతం రైతుల పరిస్థితి సాగు నీరు లేక అల్లాడిపోతున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వాపోయారు. 2 రోజుల్లో సాగునీరు అందకపోతే చేతికి వచ్చిన పంట సైతం పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉంది కాబట్టి వెంటనే సాగు నీరు అందివ్వాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఆయన కోరారు. దేవరుప్పుల మండలం మల్యా తండ, లకావత్ తండాలో నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను బిఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎండిన వరి పంటను పరిశీలించి రైతులు రాందాన్, యాకు, సోమ్లా, పూల్య లతో మాట్లాడి స్టేషన్ ఘనపూర్ రిజర్వాయర్ నుండి వచ్చే 4L కాలువకు నీళ్లు విడుదల చేసి ఎండిపోతున్న పంటలకు నీళ్లు అందించాలని ఉత్తమ్ తో పాటు అధికారులకు ఫోన్ చేసి రైతులు భాదలను వారికి తెలియజేశారు.



Printed and Published by **DHEERAVATH SREENU NAIK** on behalf of DHEERAVATH SREENU NAIK, Printed at SHASHI PRINTING PRESS Flat No.58675/9/6, Ashok Nagar, Kamareddy, Tela gana, 503111., Published at 4-109/3, Palakurthy, Jangaon District. Telangana , 506252, editor DHEERAVATH SREENU NAIK. Ph : **9866366702**, RNI: TGTEL/25/A2341